# సాక్షి సిద్దిపేట

మంగళవారం । 5 । సెప్టెంబర్ । 2023






## గుప్పుమంటున్న గుడుంబా!

పల్లెలు, మారుమూల తండాల్లో గుడుంబా మళ్లీ గుప్పుమంటోంది. 9లో▸



## దేవాలయాల అభివృద్ధికి కృషి

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు. 9లో▸

## రెండు చెక్‌డ్యాంలకు నిధులు మంజూరు

సిద్దిపేటజోన్: నియోజకవర్గం పరిధిలో మరో రెండు చెక్‌డ్యాంల నిర్మాణానికి నిధులు విడులయ్యాయని మంత్రి హరీశ్‌రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెక్‌డ్యాంలకు రూ. 4కోట్ల 62 లక్షల 90 వేలు మంజూరయ్యాయని, సిద్దిపేట వాగుపై కస్తూరిపల్లి వద్ద, నారాయణరావుపేట మండలం గోపులాపూర్ వద్ద నిర్మిస్తున్నట్లు తెలిపారు.

## న్యూస్‌రీల్

### కస్తూర్బాలో సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యే రఘునందన్‌రావు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దౌల్తాబాద్(దుబ్బాక): మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో సమస్యలు లేకుండా చూడాల్సిన బాధ్యత విద్యాధికారులపై ఉందని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఫోన్‌లో డీఈఓ శ్రీనివాస్‌రెడ్డితో మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయ ఖాళీ పోస్టులు, మౌలిక వసతుల వివరాలను ఆరా తీశారు. మళ్లీ పాఠశాలకు వచ్చేలోపు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎదైనా సమస్య ఉంటే తమకు రాతపూర్వకంగా దరఖాస్తు ఇవ్వాలని పాఠశాల ప్రిన్సిపాల్‌కు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కిషన్, కోనాయిపల్లి సర్పంచ్ సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### జిల్లాలో జోరుగా వర్షం



జిల్లా కేంద్రంలో కురుస్తున్న వాన

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రెండు రోజులుగా వర్షం కురుస్తోంది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు చిరుజల్లుల నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా సగటున 16.8మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. అక్బర్‌పేట భూంపల్లిలో 41.5మి.మీ, నంగునూరులో 40.3మి.మీ, కొమురవెల్లిలో 30.3మి.మీ, ములుగులో 27.3మి.మీ, జగదేవ్‌పూర్‌లో 26.4మి.మీ, కోహెడ మండలంలో 23.4 మి.మీ, మర్కుక్ మండలంలో 21మి.మీ, దూళ్మిట్ట మండలంలో 20మి.మీ, వర్షపాతం నమోదు అయ్యింది.

### టెట్ నిర్వహణకు సిద్ధం చేయండి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) నిర్వహణకు సర్వం సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పరీక్ష నిర్వహణకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 15న నిర్వహించే పరీక్షకు అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. పేపర్ 1 ఉదయం 9:30 నుంచి 12 గంటల వరకు, పేపర్ 2.. మధ్యాహ్నం 2:30 నుంచి 5 గంటల వరకు జరగనుందన్నారు. పేపర్ -1కు 36 సెంటర్లలో 8,625 మంది, పేపర్ 2కు 30 సెంటర్లలో 6,817 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ నాగరాజమ్మ, అడిషనల్ డీసీపీ, డీఈఓ శ్రీనివాసరెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సూర్యప్రకాష్, డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్. కాశీనాథ్, విద్యుత్ శాఖ ఎస్‌ఈ మహేష్, మున్సిపల్ కమిషనర్లు, ఆర్టీసీ, తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### జనహృదయాలను గెలిచిన గద్దర్

ప్రొఫెసర్ కాసీం

సిద్దిపేటఎడ్యుకేషన్ (హుస్నాబాద్): గద్దర్ ఆట, పాట, మాటలతో జనహృదయాలను గెలిచారని తెలుగు విభాగ అధిపతి ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాసీం అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ప్రజా ఉద్యమంలో గద్దర్ పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన కాశీమ్ మాట్లాడుతూ గద్దర్ కూడా గురుజాడ అప్పారావు వలే యుగకర్త అన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ ప్రజల్లో చైతన్యం నింపుతూ, కోసం గజ్జెకట్టి పాటపాడుతూ ఎన్నో ఉద్యమాలను కొనసాగించారన్నారు. కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడారు.



# మామంచి మాస్టార్లు

మాతృదేవోభవ – పితృదేవోభవ – ఆచార్యదేవోభవ అన్నారు పెద్దలు. తల్లి, తండ్రి, తరువాతి స్థానం గురువుదే. బుడిబుడి అడుగులు వేస్తూ బడిబాట పట్టినప్పటి నుంచి విద్యావంతులై.. ఉన్నత స్థాయికి చేరుకునే వరకు వెంటుండి నడిపించేది గురువులే.. ప్రేమ, ఆప్యాయతలకు చిహ్నంగా నిలిచే గురువు.. విద్యార్థుల కలలను నిజం చేసే ప్రత్యక్ష దైవం. ఉమ్మడి మెదక్ జిల్లాలోని కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు సర్కారు బడులను నిలబెడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. విద్యార్థుల ప్రతిభ గుర్తించి వారిని ప్రోత్సహిస్తున్నారు. సరికొత్త ఆవిష్కరణలు చేస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. వృత్తే దైవంగా భావిస్తూ.. అంకిత భావంతో పనిచేస్తూ ఎంతో మంది ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న మన మాస్టార్లు జిల్లాలో ఎందరో ఉన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని ఆదర్శ ఉపాధ్యాయులపై ప్రత్యేక కథనాలు.. 8లో▸



జగదేవ్‌పూర్ (గజ్వేల్): తిగుల్ పాఠశాలలో తొమ్మిదేళ్లుగా స్వచ్ఛందంగా బోధిస్తున్న రిటైర్డ్ హెచ్‌ఎం బాల్‌రెడ్డి

# మాతా శిశు ఆరోగ్యానికి భరోసా

**కార్పొరేట్ హంగులతో ఎంసీహెచ్ నిర్మాణం**

- వంద పడకలు, అధునాతన వైద్యసేవలు
- రూ.27.35కోట్ల వ్యయంతో పనులు
- త్వరలోనే ప్రారంభానికి సన్నాహాలు

మాతా శిశు ఆరోగ్యానికి ఇక భరోసా లభించనుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిథ్యం వహిస్తున్న గజ్వేల్‌లో వంద పడకలతో కార్పొరేట్ తరహా వసతులతో మాతా శిశు సంరక్షణ ఆస్పత్రి (మెటర్నిటీ అండ్ చైల్డ్ హెల్త్ హాస్పిటల్) నిర్మాణం పనులు దాదాపుగా పూర్తయ్యియి. రూ.27.35కోట్ల వ్యయంతో ఈ ఆస్పత్రి నిర్మాణం జరిగింది. గజ్వేల్‌తోపాటు సమీప జిల్లాలు మెదక్, యాదాద్రి, జనగామ, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలకు సైతం భారీ ప్రయోజనం చేకూరనున్నది.

– గజ్వేల్



ప్రారంభానికి సిద్ధమైన మాతా శిశు సంరక్షణ ఆస్పత్రి

గజ్వేల్‌లోని పాత ఏరియా ఆస్పత్రిలో గర్భిణుల కోసం హైరిస్క్ మానిటరింగ్ కేంద్రాన్ని రెండున్నరేళ్ల క్రితం వరకు నడిపారు. రాష్ట్రంలో సిద్దిపేట తరువాత ఇది రెండోది. ఈ నేపథ్యంలో ఈ కేంద్రానికి గజ్వేల్ నియోజకవర్గంలోని గజ్వేల్, తూప్రాన్, ములుగు, వర్గల్, జగదేవ్‌పూర్, కొండపాక మండలాలతో పాటు మెదక్, యాదాద్రి, మేడ్చల్, జనగామ జిల్లాల్లోని సరిహద్దు గ్రామాలతో పాటు మెదక్, సంగారెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భారీ ఎత్తున గర్భిణులు ఇక్కడికి డెలివరీల కోసం రావడం ప్రారంభమైంది. దీంతో నెలకు ఇక్కడ సుమారుగా 350–400 డెలివరీలు చేస్తున్నారు. కానీ ఇక్కడి వచ్చే రద్దీకి, ఉన్న సౌకర్యాలకు పొంతన లేదు. బెడ్లు సరిపోక చాలా సందర్భాల్లో ఇక్కడికి వచ్చిన వెనుదిరిగాల్సి వస్తున్నది. మరోవైపు రద్దీ తగ్గట్టుగా సిబ్బంది లేకపోడం కూడా సమస్యలను సృష్టిస్తోంది. సరైన సేవలందక తరుచూ ఈ కేంద్రంలో వివాదాలు సైతం చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ 2018 జనవరి 17న గజ్వేల్‌ను సందర్శించిన సందర్భంలో పాత ఏరియా ఆస్పత్రి... స్థానంలో వంద పడకల మాతాశిశు సంరక్షణ ఆస్పత్రి నిర్మాణానికి వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శికి ఆదేశాలిచ్చారు. ఇదే క్రమంలో ఎంసీహెచ్ నిర్మాణానికి ప్రభుత్వం 2018 సెప్టెంబర్‌లో రూ.27.35 కోట్లను విడుదల చేస్తూ జీఓ ఇచ్చింది. ఈ క్రమంలోనే పాత ఏరియా ఆస్పత్రిని కూల్చేసి దాని స్థానంలో ఎంసీహెచ్ నిర్మించాలని నిర్ణయించారు. ఇక్కడ కొనసాగిన హైరిస్క్ కేంద్రాన్ని కొత్త వంద పడకల జిల్లా ఆస్పత్రిలోకి 2019 అక్టోబర్‌లో మార్చారు. కొత్త ఎంసీహెచ్ ప్రారంభమయ్యే వరకు కొత్త వంద పడకల ఆస్పత్రిలోనే ఈ కేంద్రాన్ని ప్రస్తుతం కొనసాగిస్తున్నారు.

**సకల హంగులతో నిర్మాణం**

వివిధ కారణాల వల్ల ఈ ఆస్పత్రి పనులు ఆలస్యంగా 2021 ఏప్రిల్ 1న ప్రారంభమయ్యాయి. టీఎస్ ఎంఐడీసీ(రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ) ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయి. మాతా శిశు సంరక్షణ ఆస్పత్రిని వివిధ విభాగాలుగా నిర్మాణం చేపడుతున్నారు. ఇందులో ఆస్పత్రి భవనాన్ని జీప్లస్ టూ గా 79,800చదరపు అడుగుల విస్తీర్ణంలో వివిధ విభాగాలుగా నిర్మిస్తున్నారు. చిన్నపిల్లల ఐసీయూ, ప్రత్యేక వార్డులు, ఎస్‌ఎంసీయూ, మూడు ఆపరేషన్ థియేటర్లు, నాలుగు లేబర్ రూమ్‌లు, ఓపీ, ఫ్యామిలీ ప్లానింగ్, బ్రీస్ట్ ఫీడింగ్‌కు ప్రత్యేకమైన విభాగాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఆసుపత్రికి ఏడుగురు గైనకాలజిస్టులు, 30మంది వివిధ విభాగాల సిబ్బంది మాత్రమే ఉన్నారు. వంద పడకల ఎంసీహెచ్ సేవలు అందుబాటులోకి వస్తే 20మందికిపైగా గైనకాలజిస్టులు, వివిధ విభాగాల సిబ్బందిని మరో వందమందికిపైగా నియమించాల్సి ఉంది. నిధులు సరిపోక వైద్యుల, నర్సింగ్ క్వార్టర్ల పనులు నిలిచిపోయాయి. ఈ పనులు పూర్తి చేయడానికి రూ.6.80కోట్లు అదనపు నిధుల ప్రతిపాదనలు కోసం పంపగా..ఇంకా ఆమోదం రావాల్సి ఉంది.

**ఇక మెరుగైన వైద్యసేవలు**

గజ్వేల్‌లో మాతాశిశు సంరక్షణ ఆస్పత్రి (ఎంసీహెచ్) పనులు 95శాతం పూర్తయ్యాయి. ఈ ఆస్పత్రి వల్ల పేదలకు భారీ ప్రయోజనం కలగనున్నది. గజ్వేల్‌తోపాటు సమీప ప్రాంతాల ప్రజలకు మెరుగైన ప్రసూతి సేవలు అందుబాటులోకి వస్తాయి. త్వరలోనే ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

– విశ్వప్రసాద్, డీఈ, టీఎస్‌ఎంఐడీసీ

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

**నేడు టీటీసీ భవన్‌లో అవార్డుల ప్రదానం**



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 50 మందిని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా విద్యాశాఖ గుర్తించింది. జిల్లా కేంద్రంలోని టీటీసీ భవన్‌లో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు అవార్డులు ప్రదానం చేయనున్నారు.

**గెజిటెడ్ హెడ్‌మాస్టార్ విభాగంలో..**

రహీం (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మునిగడప, జగదేవ్‌పూర్), చంద్రశేఖర్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మహద్మాపూర్, హుస్నాబాద్).

**ప్రధానోపాధ్యాయుల విభాగంలో..**

అహ్మద్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అంక్షాపూర్, నంగునూరు), ఉమారాణి (ఎంపీపీఎస్ కడవేర్గు, చేర్యాల).

**పీజీటీ విభాగంలో....**

నాగార్జున సాగర్ (టీఎస్‌ఎంఎస్ జగదేవ్‌పూర్), శివప్రసాద్ (టీఎస్‌ఎంఎస్ జగదేవ్‌పూర్).

**స్పెషల్ ఆఫీసర్ విభాగంలో...**

స్వర్ణలత (కేజీబీవీ మిరుదొడ్డి).

**లాంగ్వేజ్ పండిట్ విభాగంలో..**

రాజు (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొండాపూర్, దూళ్మిట్ట), భైరారెడ్డి (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చింతమడక, సిద్దిపేటరూరల్), మహ్మద్ షాబుద్దీన్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చేబర్తి, మర్కుక్), మంగమ్మ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరానగర్, సిద్దిపేట అర్బన్).

**స్కూల్ అసిస్టెంట్ విభాగంలో..**

మధు (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరానగర్, సిద్దిపేట అర్బన్), జయకుమార్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దౌల్తాబాద్), అమీర్ షరీఫ్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాములపర్తి, మర్కుక్), సుభాష్ చంద్రరెడ్డి (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మజీద్‌పల్లి, వర్గల్), అనురాధ (యూపీఎస్ ధర్మారం, మిరుదొడ్డి), తిరుపతి (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జక్కాపూర్, నారాయణరావుపేట), బాలయ్య (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దుబ్బాక), శారదా ప్రసాద్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దగుండవెల్లి, దుబ్బాక), శ్రీనివాస్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిరసనగండ్ల, కొండపాక), కరుణాకర్‌రెడ్డి (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బుస్సాపూర్, సిద్దిపేట రూరల్), తిరుపతి (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిరసనగండ్ల, కొండపాక), సరిత (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొడకండ్ల, గజ్వేల్), సయ్యద్ సర్వర్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మద్దూరు), వెంటకస్వామి (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాఘవాపూర్, సిద్దిపేట రూరల్).

**ఎస్‌జీటీ విభాగంలో..**

జైపాల్‌రెడ్డి (ఎంపీపీఎస్ పాములపర్తి, మర్కుక్), రజనరేందర్‌రెడ్డి (ఎంపీపీఎస్‌బుర్రగూడెం, వర్గల్), శ్రీనివాస్‌రెడ్డి (ఎంపీపీఎస్ పోతిరెడ్డిపల్లి, చేర్యాల), రాములు (ఎంపీపీఎస్ తొగుట), రవి (ఎంపీపీఎస్ రామవరం, అక్కన్నపేట), కుమార్ (ఎంపీపీఎస్ ఎర్రవెల్లి, మర్కుక్), పద్మవతి (ఎంపీయూపీఎస్ నాంచారుపల్లి, సిద్దిపేట అర్బన్), గోపికల (ఎంపీపీఎస్ రిమ్మనగూడ, గజ్వేల్), పద్మ (ఎంపీపీఎస్ కుచానపల్లి, హుస్నాబాద్ మండలం), జనార్దన్ (ఎంపీపీఎస్ దుబ్బాక-1), వెకంటేశ్వర్లు (ఎంపీపీఎస్ లింగారెడ్డిపల్లి, జగదేవ్‌పూర్), యాదయ్య (ఎంపీపీఎస్ హుస్నాబాద్), అశోక్ (ఎంపీపీఎస్ ఖాజాపూర్, అక్బర్‌పేట భూంపల్లి), రజనీష్ (ఎంపీపీఎస్ దాచారం, బెజ్జంకి), భాగ్యలక్ష్మి (ఎంపీపీఎస్ పెద్దమ్మగడ్డ, చేర్యాల), స్వామి (ఎంపీపీఎస్ హరిజనవాడ, చిన్నకోడూరు), సమంత (ఎంపీపీఎస్ తీగుల్ నర్సాపూర్, జగదేవ్‌పూర్), గంగా (ఎంపీపీఎస్ గుండారెడ్డి పల్లి, కోహెడ), త్రివిక్రం శర్మ (ఎంపీపీఎస్ మర్రిముచ్చాల, కొమురవెల్లి), సత్య కృష్ణ (ఎంపీపీఎస్ మంగోల్, కూకునూరుపల్లి), శ్రీనివాస్‌రెడ్డి (ఎంపీపీఎస్ బస్వాపూర్, కోహెడ), చంద్రయ్య (ఎంపీపీఎస్ జేపీ తండా, నంగునూరు), భాస్కర్ (ఎంపీపీఎస్ రాయిపోల్), రాధా పద్మజ (ఎంపీపీఎస్ చిన్నగెండవెల్లి, సిద్దిపేట రూరల్).

# అర్జీలను సత్వరం పరిష్కరించండి

**అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్**



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: ప్రజావాణికి వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను ఎప్పటికప్పుడు త్వరగా పరిష్కరించి మళ్లీ సమస్య పునరావృతం కాకుండా చూడాలన్నారు. పరిష్కరించిన అర్జీల సంబంధిత వివరాలను వారంలోగా రిపోర్ట్ తెలియజేయాలన్నారు. ప్రజావాణికి అధికారులందరూ విధిగా హాజరుకావాలని ఆదేశించారు. ప్రజావాణిలో భూసంబంధిత, ఆసరా పింఛన్లు ఇతర మొత్తం కలిపి 15 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్వో నాగరాజమ్మ, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఐఓసీ పనుల పరిశీలన

హుస్నాబాద్: పట్టణ శివారులో రూ.17కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఐఓసీ బిల్డింగ్ నిర్మాణ పనులను సోమవారం కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హుస్నాబాద్‌లో ఐఓసీ బిల్డింగ్ పనులు పూర్తి కావచ్చాయన్నారు. త్వరలోనే మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ బెన్ షాలెమ్, డీఎస్‌ఓ శ్రీనివాస్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ మూర్తి, డీటీఓ బాలరాజు, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, డీపీఓ దేవికీదేవి, డీఏఓ శివప్రసాద్, అధికారులు, నిర్మాణ ఏజన్సీ కాంట్రాక్టర్ తదితరులు ఉన్నారు.



సమీకృత కార్యాలయ భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

# వైద్య పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్‌రూరల్: ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వివిధ వైద్య పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గజ్వేల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయి కిరణ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సివిల్ అసిస్టెంట్ సర్జన్(9), పీడియాట్రిక్(2), గైనకాలజీ(2), అనెస్థిషియా(3), జనరల్ ఫిజీషియన్(2) విభాగాల్లో కాంట్రాక్టు పద్ధతిలో వైద్య పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 6 నుంచి 20వ తేదీలోగా గజ్వేల్‌లోని ప్రభుత్వాస్పత్రిలోని కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. నియామకాలు డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతాయని పేర్కొన్నారు.

# ప్లాస్టిక్ నిషేధం అందరి బాధ్యత

- పారిశుద్ధ్యంలో నిర్లక్ష్యం తగదు
- డీపీఓ దేవకీదేవి

హుస్నాబాద్‌రూరల్: హోటళ్లు, కిరాణం దుకాణాల్లో ప్లాస్టిక్, కప్పులు, కవర్లు వంటివి విక్రయించడం, వాడటం నిషేధించాలని, ఇది అందరూ బాధ్యతగా తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి అన్నారు. సోమవారం గాంధీనగర్ గ్రామ పంచాయతీని సందర్శించి టీ హోటళ్లను తనిఖీ చేసి ప్లాస్టిక్ కప్పులు వాడవద్దని హెచ్చరించారు. గ్రామంలో పారిశుద్ధ్య లోపించడంతో పంచాయతీ కార్యదర్శి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే మహ్మదాపూర్ గ్రామంలోని నర్సరీని సందర్శించి మొక్కలను పరిశీలించారు. హరితహారంలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంను చేరుకోవాలని ఫీల్డు అసిస్టెంట్, కార్యదర్శులకు సూచించారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండాలని, విధుల పట్ల ఎవరు నిర్లక్ష్యం వహించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీరివెంట ఎంపీఓ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



మహ్మదాపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న డీపీఓ దేవకీదేవి

# తొలి జాబితాలో ఆ ముగ్గురికి..

- దామోదర్, జగ్గారెడ్డి, చంద్రశేఖర్‌కు చోటు
- ఖాయమంటున్న కాంగ్రెస్ పార్టీ వర్గాలు
- మిగిలిన అభ్యర్థిత్వాలు మలి జాబితాల్లో



దామోదర రాజనర్సింహ



టి.జగ్గారెడ్డి



ఏ.చంద్రశేఖర్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి : రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేయనున్న అభ్యర్థుల తొలి జాబితాలో ఉమ్మడి జిల్లాలోని ముగ్గురు నేతలకు చోటు దక్కడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. జాబితాలో అందోల్ నియోజకవర్గం నుంచి మాజీ ఉప ముఖ్యమంత్రి, సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర రాజనర్సింహ, సంగారెడ్డి నుంచి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పేర్లు ఉంటాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. అలాగే ఇటీవల బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ మంత్రి ఏ.చంద్రశేఖర్ పేరు కూడా జహీరాబాద్ నియోజకవర్గం నుంచి ఉండే అవశాలున్నాయి. అందోల్ టిక్కెట్ కోసం దామోదర రాజనర్సింహతో పాటు ఆయన కూతురు త్రిష మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. సంగారెడ్డి నియోజకవర్గం నుంచి జగ్గారెడ్డితో పాటు మరో నలుగురు దరఖాస్తు చేసుకున్నప్పటికీ, జగ్గారెడ్డి పేరు తొలిజాబితాలో చోటు దక్కనుంది. ఇక జహీరాబాద్ నియోజకవర్గంలో చంద్రశేఖర్‌తో పాటు స్థానికంగా ఉండే ఐదుగురు దరఖాస్తు చేసుకున్నారు. ఈ టిక్కెట్ హామీతోనే చంద్రశేఖర్ పార్టీలో చేరడంతో తొలిజాబితాలోనే ఆయన పేరు ఖాయంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వాలను ఖరారు చేసే ప్రక్రియను ఆ పార్టీ స్క్రీనింగ్ కమిటీ చేపట్టింది. ఆయా నియోజకవర్గాల టికెట్ల కోసం గతనెల 25 వరకు అందిన దరఖాస్తులను ఈ కమిటీ పరిశీలిస్తుంది. ఈ నేపథ్యంలో టికెట్లు ఎవరికి దక్కుతాయోనని ఆసక్తి నెలకొంది.

**మలిజాబితాలో..**

నారాయణఖేడ్ నియోజకవర్గంలో మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి మధ్య పంచాయితీ తేలితే ఇక్కడి అభ్యర్థిత్వంపై స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. అలాగే మెదక్‌లో నియోజకవర్గానికి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, చౌదరి సుప్రభాత్‌రావు, మ్యాడం బాలకృష్ణలతో కలిసి ఏకంగా 12 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇక్కడ కొత్త నాయకుడు పార్టీలో చేరే అవకాశాలుండటంతో మెదక్ అభ్యర్థిత్వం తొలిజాబితాలో ఉండే అవకాశం లేదు.

**ఆ రెండు చోట్ల పీటముడి..**

పటాన్‌చెరు, నర్సాపూర్ నియోజకవర్గాల విషయంలో పీటముడి నెలకొంది. పటాన్‌చెరువు నియోజకవర్గం టికెట్ కోసం టీపీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్ ఆశిస్తున్నారు. తొలి జాబితాలోనే తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసుకునేందుకు గట్టి ప్రయత్నాల్లో ఉన్నారు. మరోవైపు కాటా శ్రీనివాస్‌గౌడ్ కూడా ఈ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. మరోవైపు గాలి అనిల్ కూడా నర్సాపూర్ టికెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఒకవేళ గాలి అనిల్‌కు నర్సాపూర్ టికెట్ ఖరారైతే పటాన్‌చెరు టికెట్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. పటాన్‌చెరులో కాటాతోపాటు శశికళాయాదవ్‌రెడ్డి, ఎం.సప్నాన్‌దేవ్. ఇలా మొత్తం తొమ్మిది మంది దరఖాస్తు చేసుకున్నారు. నర్సాపూర్ నియోజకవర్గానికి గాలి అనిల్‌తో పాటు, ఆవుల రాజిరెడ్డి, శివన్నగారి ఆంజనేయులుగౌడ్, రవీందర్‌రెడ్డి తదితరులు ఆశిస్తున్నారు.

**ఆ నాలుగు చోట్ల..**

దుబ్బాక టికెట్ కోసం చెరుకు శ్రీనివాస్‌రెడ్డి గట్టి ప్రయత్నాల్లో ఉన్నారు. ఇక్కడ కత్తి కార్తీకగౌడ్, శ్రావణ్‌కుమార్‌రెడ్డి కూడా టిక్కెట్ ఆశిస్తున్నారు. అయితే ఉప ఎన్నికల్లో పోటీ చేసిన వారికే సాధారణ ఎన్నికల్లోనూ టికెట్ ఇవ్వాలనే పార్టీ నిబంధన ఉన్నందున తనకే టికెట్ తనకే దక్కుతుందని శ్రీనివాస్‌రెడ్డి భావిస్తున్నారు. కర్ణాటక కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ ద్వారా శ్రావణ్‌కుమార్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. సిద్దిపేట టిక్కెట్ కోసం ఏకంగా 15 మంది దరఖాస్తు చేసుకోగా, గజ్వేల్ టికెట్‌కూ పోటాపోటీ నెలకొంది. ఇక్కడ రాష్ట్ర ముఖ్యమంత్రిపై పోటీ చేసే అభ్యర్థి కావడంతో కాంగ్రెస్ ఆచీతూచి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తం మీద ఉమ్మడి జిల్లాలో తొలి జాబితాలో మూడు పేర్లు మాత్రమే ఉండే అవకాశాలున్నాయనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.


ఆత్మహత్య చేసుకున్న పత్తి రైతు చేను వద్దకు వెళ్లి అధ్యయనం చేస్తున్న పులిరాజు

## రైతు బాంధవుడు పులిరాజు

దుబ్బాకటౌన్ : మల్లన్నసాగర్ ముంపు గ్రామం తొగుట మండలం ఏటిగడ్డ కిష్టాపూర్‌కు చెందిన పులి రాజు ప్రస్తుతం వర్గల్ మండలం తునిఖిఖాల్సాలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. పిల్లలకు ఉత్తమ బోధన చేయడమే కాదు.. రైతు కుటుంబాలకు ఆపదొస్తే ఆగడు. 23 ఏళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ రైతన్న ఆత్మహత్య చేసుకున్నా అక్కడ పులిరాజు ప్రత్యక్షమవుతాడు. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ పరంగా ఆ కుటుంబాలకు సాయం అందేలా చూస్తాడు. ఇప్పటి వరకు సుమారు రెండువేలకు కుటుంబాలను తనకు చేతనైన సాయం అందించాడు. అదేవిధంగా సుమారు 30 మంది పిల్లల చదువులు ఆగిపోకుండా చేయూతనిచ్చారు. ఈ సందర్భంగా పలు పురస్కారాలు ఆయనను వరించాయి. రైతునేస్తం, రైతు బాంధవుడు, 2019లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు అందుకున్నారు.

# మాస్టార్లు

'గురు బ్రహ్మా, గురు విష్ణు.. గురు దేవో మహేశ్వరహ.. గురు సాక్షాత్ పరబ్రహ్మా.. తస్మై శ్రీ గురవే నమః' అని అన్నారు పెద్దలు. తల్లి, తండ్రి తరువాత స్థానం గురువుదే అని స్పష్టం చేశారు. 'గురువు' అనే పదానికి ప్రత్యేకమైన స్థానం ఉంది. అలాంటి గురువు ఉత్తమ బోధనతో పిల్లలను రేపటి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంతోపాటు సేవాగుణంతో సమాజంలో మన్ననలు పొందుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులం కదా మనకెందుకులే అనే భావనతో కాకుండా.. మానవతా దృక్పథంతో వారు అందిస్తున్న సేవలకు ఉత్తమ అవార్డుల రూపంలో ప్రశంసలు అందుకుంటున్నారు.




## బోధనలో వినూత్నం


విద్యార్థులతో వరి నాట్లు వేయిస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): వల్లభాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రనోపాధ్యాయుడు పరమేశ్వర్‌రెడ్డి విద్యార్థులకు వినూత్న రీతిలో బోధన చేస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నాడు. పరిసరాల విజ్ఞానం కోసం స్వయంగా పొలాల వద్దకు విద్యార్థులను తీసుకెళ్లి వరినాట్లు, కలుపు, కోతలపై అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేశారు. అందులో కూరగాయాలను పండించి మధ్యాహ్న భోజనంలో వాటిని ఉపయోగిస్తున్నారు. ఫ్లకార్డులు, అట్ట ముక్కలతో తయారు చేసిన బొమ్మలతో గణితం, తె లుగు పాఠాలు బోధిస్తున్నారు. ఈయన 2021లో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు.

## క్రీడల శిక్షణలో మేటి


విద్యార్థులతో రన్నింగ్ చేయిస్తున్న రాజేందర్


కౌడిపల్లి(నర్సాపూర్): మండల పరిధిలోని వెల్మకన్న ఉన్నత పాఠశాలలో పనిచేసే పీఈటీ ఇప్ప రాజేందర్ కోచింగ్‌లో విద్యార్థులు సత్తాచాటుతున్నారు. బూరుగడ్డకు చెందిన పాఠశాల విద్యార్థిని తాటి పూజ షాట్‌పుట్, హైజంప్‌లో రాష్టస్థాయి ప్రథమ బహుమతి సాధించి జాతీయ స్థాయిలో పాల్గొన్నారు. ఈమె జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో సుమారు ఇరవైకిపైగా పతకాలు గెలిచింది. రన్నింగ్‌లో శ్రీనివాస్, నాగరాణి, సాయిరాం, భరత్, వెంకటేశం, నితిన్ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన్నారు. 18వ నేషనల్ జంబూరి క్యాంప్‌నకు సాయికుమార్, భరత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు ఎంపిక కాగా రాజస్థాన్‌లో పాల్గొన్నారు. రాజేందర్ సేవలకు గుర్తింపుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపకయ్యారు.

## పతకాలు కొల్లగొట్టాల్సిందే..


కరాటే శిక్షణ ఇస్తున్న పీడీ ప్రతాప్‌సింగ్


వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రతాప్‌సింగ్ రాథోడ్ ఆటల్లో కోచింగ్ ఇచ్చాడంటే విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాల్సిందే. పిల్లలలో నైపుణ్యాన్ని గుర్తించి వివిధ క్రీడల్లో శిక్షణ ఇస్తుంటాడు. కరాటేలో బ్లాక్‌బెల్ట్ హోల్డరైన ప్రతాప్‌సింగ్ కరాటే, జూడో తైక్వాండ్ వంటి క్రీడల్లో 3 వేల మందికి పై చిలుకు విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చారు. అందులో 11 మంది బ్లాక్ బెల్ట్, మరికొందరికి గ్రీన్, ఆరెంజ్ బెల్ట్‌లు సాధించారు. పీడీ సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసింది.

## ఆంగ్ల బోధనతో మన్ననలు


బోధిస్తున్న ప్రమోద్

చిన్నశంకరం పేట(మెదక్): చిన్నశంకరం పేట మండలం వెంకట్రావుపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ప్రమోద్ తనదైన శైలిలో ఆంగ్ల బోధన చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ప్రయివేట్ పాఠశాలలో చదివే విద్యార్థులు సైతం ప్రభుత్వ పాఠశాలలో చేరేవిధంగా తన బోధన సాగుతోంది. విద్యార్థుల సంఖ్య పడిపోయి పాఠశాల మూసివేత దిశ నుంచి నేడు 70 మంది విద్యార్థులు పాఠశాలలో చదువుకునేలా కృషి చేశాడు. గతేడాది పాఠశాల తనిఖీకి వచ్చిన అప్పటి డీఈఓ రమేష్ కుమార్ ప్రమోద్ పనితీరును ప్రశంసించారు. అంతేకాకుండా 2022లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసి సత్కరించారు.

## రిటైర్డ్ అయినా.. విద్యాదాతగా


తిగుల్ పాఠశాలలో బాల్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామానికి చెందిన టి.బాల్‌రెడ్డి 1970లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరారు. 34 ఏళ్ల పాటు పనిచేసి 2004లో అనంతసాగర్ పాఠశాలలో రిటైర్డ్ అయ్యారు. పదవీ విరమణ పొందిన ఈయన హాయిగా విశ్రాంతి తీసుకోకుండా.. తొమ్మిదేళ్లుగా వివిధ ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా పాఠాలు బోధిస్తూ విద్యాదాతగా మారారు. విద్యార్థులకు తెలుగు పాఠాలు చెబుతున్నాడు. ప్రస్తుతం తన సొంత గ్రామమైన తిగుల్ ప్రాథమిక పాఠశాలలో ఐదేళ్లుగా పనిచేస్తున్నారు. నయా పైసా తీసుకుకోకుండా ఇంటి నుంచి తీసుకవచ్చి తీసుకపోతే సరిపోతుంది.ఆయన సేవలకు ఇటీవల ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, జిల్లా విద్యాధికారులు శాలువాలు కప్పి సన్మానించారు.

## పట్టుదలతో బడిని నిలబెట్టాడు


విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఓంకార్

మర్కూక్(గజ్వేల్): మర్కూక్ మండలం అంగడి కిష్టాపూర్ మారుమూల గ్రామం. అక్కడి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో మూతపడే స్థితికి చేరుకుంది. అలాంటి బడిలో ఉపాధ్యాయుడు ఓంకార్ రాధాకృష్ణ ఆంగ్ల మాధ్యమంలో బోధన మొదలు పెట్టి కార్పొరేట్ స్థాయికి తీసిపోని విధంగా తీర్చిదిద్దారు. ఒకప్పుడు 12 మంది విద్యార్థులకు ఒక్కరే ఉపాధ్యాయుడు ఉండేవారు. రాధాకృష్ణ కృషితో ప్రస్తుతం 210మంది విద్యార్థులు బడికి వచ్చేలా చేశారు. నర్సరీ నుంచి 8వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలోనే విద్యాబోధన చేస్తున్నారు. ముగ్గురు ఉపాధ్యాయులు, 5 విద్యావాలంటీర్లతో సకల సౌకర్యాలతో బడి వెలుగుతుంది. ఓంకార్ రాధాకృష్ణ సెకండరీ గ్రేడ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా గతేడాది ఎంపికయ్యారు. అదే పాఠశాలకు చెందిన టీచర్ రామకృష్ణారెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు.

## పల్లెబడిని తీర్చిదిద్ది..

వర్గల్(గజ్వేల్): కేవలం 19 మంది విద్యార్థులు ఉన్న వర్గల్ మండలం శాకారం ప్రాథమిక పాఠశాలకు 2011లో వరాల ప్రశాంత్‌కుమార్ బదిలీపై వచ్చారు. శిథిల స్కూల్ భవనం, పిచ్చిమొక్కలు చూసి బడిని మార్చాలని నిర్ణయించుకున్నాడు. సొంతఖర్చుతో పాఠశాల మెరుగులు దిద్దేపనిలో మునిగిపోయాడు. దాతలు తోడవడంతో శిథిల బడి బాగుపడింది. కార్పొరేట్ స్కూల్స్ స్థాయిలో డిజిటల్ తరగతులు, మ్యాగ్నెటిక్ బోర్డులు, ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన మొదలు కావడంతో శాకారం బడికి విద్యార్థులు క్యూ కట్టారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 60 దాటేసింది. ప్రశాంత్‌కు 2020లో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. వీటితోపాటు అనేక అవార్డులు ఆయన సొంతమయ్యాయి.


ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్న శాకారం స్కూల్

## తెలుగుపై మమకారంతో..

కొండాపూర్(సంగారెడ్డి): కొండాపూర్ మండలంలోని సైదాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో డాక్టర్ పూర్ణ కృష్ణ తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈయనకు మొదటి నుంచి తెలుగు భాష అంటే మమకారం. విద్యార్థులతో తెలుగులో కవిత్వాలు రాయించడం, వారికి గేయాల రూపంలో పాఠాలు బోధించడం ఆయన ప్రత్యేకత. తెలుగు భాష కోసం విశేష కృషి చేసినందుకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఇప్పటి వరకు తొమ్మిది శతకాలు, వచన కవనం ఆవిష్కరించారు. ఈయన తెలుగు భాషకు చేస్తున్న కృషికి గానూ అమెరికా గురజాడ వారి జాతీయ పురస్కారం, కాళోజీ పురస్కారం, ఉగాది సాహితీ పురస్కారం, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార అవార్డులు వరించాయి.


పాఠాలు బోధిస్తున్న డాక్టర్ పూర్ణ కృష్ణ

## ప్రైవేట్‌కు దీటుగా..

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని రాయిపల్లి(డి) తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను హెచ్‌ఎం దేవిసింగ్ రాథోడ్ ప్రైవేట్ స్కూల్‌కు ధీటుగా తయారు చేశారు. డ్రాప్ అవుట్ లేకుండా చేసి విద్యాప్రమాణాలను పెంచారు. 2015 సంవత్సరంలో హెచ్‌ఎంగా పదవి బాధ్యతలను స్వీకరించినప్పుడు 63 విద్యార్థులు ఉండగా ప్రస్తుతం స్కూల్‌లో 135 మంది స్టూడెంట్స్ ఉన్నారు. సొంత ఖర్చుతో నిధులతో డిజిటల్ క్లాస్ ఏర్పాటు చేసి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం నేడు హరితక్షేత్రంగా మార్చారు. దేవిసింగ్ సేవలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందజేశారు. ఆయన కృషి వల్ల పాఠశాలకు స్వచ్ఛ బడి అవార్డు కూడా వచ్చింది.


డిజిటల్ క్లాసులు బోధిస్తున్న దేవిసింగ్ రాథోడ్

## బాలకార్మికుల నిర్మూలనకు కృషి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): సదాశివపేట మండలం నందికంది ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దండు అంజయ్య. ఈయన కోహిర్, పుల్కల్, చౌటకూర్లకు ఇంచార్జి మండల విద్యాధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. అంజయ్య బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు విశేషంగా కృషి చేశారు. దాదాపు 800మంది పిల్లలకు పని నుంచి విముక్తి కలిగించి ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో చేర్పించారు. ఇందుకుగాను ఢిల్లీలో అప్పటి కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి స్మృతి ఇరానీ చేతుల మీదుగా ఉమ్మడి ఏపీ నుంచి బెస్ట్ నేషనల్ ఎంఈఓగా అవార్డు అందుకున్నారు. 2012లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడు, 2011లో బెస్ట్ ఎంఈఓ, 44సార్లు రక్తదానం చేసి బెస్ట్ బ్లడ్ డోనర్ అవార్డులను ఆయన అందుకున్నారు.


చిన్నారిని పాఠశాలలో చేర్పిస్తున్న ఎంఈఓ అంజయ్య

## తాగిన మైకంలో హత్య

మనోహరాబాద్(తూప్రాన్): తాగిన మైకంలో వ్యక్తిని హత్య చేసిన సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం తూప్రాన్ సీఐ శ్రీధర్, మనోహరాబాద్ ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు. మెదక్ జిల్లా కొల్చారం మండలం రాంపూర్‌కు చెందిన నెల్లి మల్లేష్(35) మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో రోడ్ల వెంట సేకరించిన స్క్రాబ్‌ను అమ్ముకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం తారామతిపేట్‌కు చెందిన చిట్టరి రమేష్ కూడా ఇదే పనిచేస్తూ 15 రోజుల క్రితం మల్లేష్‌కు పరిచయమయ్యాడు. ఈ క్రమంలో శనివారం ఇద్దరు కలిసి మద్యం సేవించారు. మందు సరిపోలేదని మల్లేష్‌ను రమేష్ డబ్బులు అడిగాడు. డబ్బులు లేవనడంతో బండరాయితో మల్లేష్ తలపై బాది హత్య చేసి పరారయ్యాడు. పోలీసులకు సమాచారం తెలియడంతో ఆదివారం హంతకుడి కోసం వెతకగా మేడ్చల్‌లో దొరికాడు. అతన్ని విచారించగా మద్యం కోసం డబ్బులు ఇవ్వలేదనే చంపినట్లు రమేష్ నేరం అంగీకరించాడు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

# తల్లి డబ్బులు ఇవ్వలేదని..

### యువకుడి ఆత్మహత్య


అంజిరెడ్డి (ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): అవసరం కోసం తల్లి డబ్బులు ఇవ్వలేదని యువకుడు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన జిన్నారం మండలం బొల్లారం పీఎస్ పరిధిలో సోమవారం జరిగింది. సీఐ నయీముద్దీన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా గోపాల్‌పేట్ గ్రామానికి చెందిన సీతమ్మ కొడుకు అంజిరెడ్డి(23)తో కలిసి బొల్లారంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉంటుంది. ఆటో కొనుక్కోవడానికి లక్ష రూపాయలు కావాలని తల్లిని అడిగాడు. తల్లి డబ్బులు లేవనడంతో అంజిరెడ్డి మనస్తాపం చెందిన పెట్రోల్ బాటిల్ నింపుకోని గ్రామ శివారుకు వెళ్లాడు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని సెల్ఫీ ఫొటో స్నేహితుడికి పంపాడు. స్నేహితుడు ఈ విషయాన్ని అంజిరెడ్డి తల్లికి చెప్పాడు. ఘటనా స్థలానికి వెళ్లి చూడగా అప్పటికే అంజిరెడ్డి మృతిచెంది ఉన్నాడు. విషయం తెలుసుకున్న సీఐ నయీముద్దీన్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తమై పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

**ఉద్యోగం రాలేదని...**

పటాన్‌చెరు టౌన్: ఉద్యోగం దొరకడం లేదని ఓ యువకుడు మనస్తాపం చెంది ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రమణ కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశంకు చెందిన పండ్లపుల్ల అంజిరెడ్డి 8 నెలల క్రితం బతుకుదెరువు కోసం అమీన్‌పూర్ మండలం నర్రగూడెంకు వచ్చాడు. ఇతని తమ్ముడు వేణుగోపాల్ రెడ్డి(29) నాలుగు నెలల క్రితం నర్రగూడెంకి వచ్చి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. పది రోజుల క్రితం అంజిరెడ్డి భార్యతో కలిసి ప్రకాశం జిల్లా కందుకూరులోని బంధువుల ఇంటికి వెళ్లాడు. నర్రగూడెంలోని అన్న ఇంట్లో ఉన్న వేణుగోపాల్‌రెడ్డి ఉద్యోగం దొరకడం లేదని ఆదివారం ఫ్యానుకు ఉరి వేసుకుని చనిపోయాడు. సోమవారం అక్కడికి వచ్చిన బంధువు గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# పెళ్లింట విషాదం

- కూతురు పెళ్లి జరిగిన కొద్దిసేపటికే ఆగిన తండ్రి గుండె


శ్రీశైలం(ఫైల్)

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): కూతురికి ఉదయం వైభవంగా పెళ్లి చేసి సాయంత్రం అత్తవారింటికి పంపే తంతూ కొనసాగుతుండగా ఓ తండ్రి ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణాలు విడిచాడు. దీంతో ఆ పెళ్లింట విషాదం నెలకొంది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేట మండలంలోని ముబారక్‌పూర్(బి) గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన కొరుబాయిని శ్రీశైలం (46) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తన భార్య అనారోగ్యంతో ఆరు నెలల క్రితం మృతి చెందింది. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు మానస వివాహాన్ని ఈనెల 3న ఆదివారం సదాశివపేట పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో బంధుమిత్రుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించాడు. సాయంత్రం తన స్వగృహంలో అప్పగింతలు జరుగుతున్న సమయంలో శ్రీశైలంకు ఉన్నట్టుండి ఛాతిలో నొప్పి రావడంతో కుప్పకూలిపోయాడు. వెంటనే సంగారెడ్డిలోని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించాడని వైద్యులు నిర్ధారించారు. చిన్న కూతురు అనూష అనాథగా మిగలడంతో బంధుమిత్రులు కన్నీరు మున్నీరయ్యారు. సోమవారం గ్రామంలో శ్రీశైలం అంత్యక్రియలు నిర్వహించారు.

## గంజాయి పట్టివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన కార్తీక్, కమల్ సంజయ్‌లు ఆంధ్రప్రదేశ్ అరకు ప్రాంతం నుంచి 63 ప్యాకెట్లలో 125 కిలోల గంజాయిని తీసుకొని కారులో బయల్దేరారు. సొంత రాష్ట్రానికి వెళ్తుండగా సోమవారం సాయంత్రం కొల్లూరు రింగ్ రోడ్డు వద్ద ఎస్‌ఓటీ, కొల్లూర్ పోలీసుల తనిఖీల్లో వారు పట్టుబడ్డారు. గంజాయిని స్వాధీనం చేసుకొని వారిని విచారించారు. మహారాష్ట్ర అమరావతి జిల్లాకు చెందిన రాజు గంజాయి తీసుకొస్తే డబ్బులు ఇస్తానని చెప్పడంతో వచ్చామని నిందితులు తెలిపారు.

# హత్య కేసులో జీవిత ఖైదు

పటాన్‌చెరు టౌన్: బావను హత్య చేసిన కేసులో బావమరిదికి జీవిత ఖైదు పడిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపిన వివరాలు. కల్హేర్ గ్రామానికి చెందిన ఆలకుంట సాయిలు, అతడి బావ గంగాధర్ ఇద్దరు కలసి అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడ గ్రామంలో ఉంటూ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా, సాయిలు సోదరితో గంగాధర్‌కు వివాహమైంది. ఇతర కారణాలతో ఆమెను గంగాధర్ వదిలేశాడు. ఈ క్రమంలో 2021 నవంబర్ 20వ తేదీన బావ, బావమరిది కలిసి మద్యం సేవించారు. మద్యం మత్తులో సాయిలును గంగాధర్ దుర్భాషలాడాడు. దీంతో ఆగ్రహించిన సాయిలు కూరగాయల కత్తితో గంగాధర్ గొంతు కోయగా తీవ్ర గాయమైంది. గంగాధర్‌ను ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అప్పట్లో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా నిందితుడు సాయిలును సోమవారం సంగారెడ్డి జిల్లా కోర్టులో రెండవ అదనపు జిల్లా సెషన్ కోర్ట్ న్యాయమూర్తి కృష్ణ అర్జున్ ఎదుట హాజరుపరిచారు. పీపీ విజయ శంకర్ రెడ్డి వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి నిందితుడు సాయిలు కు జీవిత ఖైదుతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పు ఇచ్చారు.

# వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి

**విద్యుత్ ఘాతంతో రైతు..**


గోవర్ధన్ మృతదేహం

కొల్చారం(నర్సాపూర్): పొలం వద్ద తెగిపడిన విద్యుత్ తీగ రైతును బలి తీసుకుంది. ఈ సంఘటన కొల్చారం మండలం సీతారాం తండాలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ మమ్మద్ గౌస్ తెలిపిన వివరాలు. తండాకు చెందిన రైతు బానోత్ గోవర్ధన్ (54) సోమవారం ఉదయం వెలుగుగుట్ట సమీపంలోని తన పొలం వద్దకు వెళ్లాడు. ఉదయం నుంచి భారీవర్షం కురవడంతో మడుల్లో నీటిని తీసే పనిలో నిమగ్నమయ్యాడు. అక్కడే విద్యుత్ తెగి పడటంతో విద్యుదాఘాతానికి గురై గోవర్ధన్ మృతిచెందాడు. మృతునికి భార్య శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

**చేపలు పట్టేందుకు వెళ్లి..**


సిద్దయ్య(ఫైల్)

హవేళీఘనపూర్(మెదక్): చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి చెరువులోపడి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని జక్కన్నపేట గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన శీల సిద్దయ్య(54) ఆదివారం కొచ్చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులోపడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు హవేళీఘనపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య రాజవ్వ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

**వాహనం ఢీకొని..**

జహీరాబాద్ టౌన్: మండల పరిధిలోని సత్వార్ గ్రామ శివారులో 65వ జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు చిరాగ్‌పల్లి ఎస్‌ఐ నరేష్ తెలిపారు. సుమారు 40 సంవత్సరాల వయసు ఉన్న వ్యక్తి హైవేపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో అతను అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిస్తే 87126 56766 నంబర్‌కు కాల్ చేయాలని ఎస్‌ఐ కోరారు.

**డీసీఎం ఢీకొని..**


సుధాకర్ (ఫైల్)

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ముస్త్యాల గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కడవేర్గు గ్రామానికి చెందిన జంగ సుధాకర్(37), జంగ ఆశయ్య ద్విచక్ర వాహనంపై మద్దూరు మండల కేంద్రంలో జరిగే పెళ్లికి హాజరయ్యేందుకు బయల్దేరారు. ముస్త్యాల గ్రామ శివారుకు రాగానే ఎదురుగా వస్తున్న డీసీఎం వారి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని అంబులెన్సులో పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా అప్పటికే సుధాకర్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆశయ్య చికిత్స పొందుతున్నాడు. మృతుడి భార్య రేవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

**చెరువులో పడి..**

పాపన్నపేట(మెదక్) చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు వల చుట్టుకొని చెరువులో మృత్యువాత పడిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పాపన్నపేట పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. టేక్మాల్ మండలం సూరంపల్లి గ్రామానికి చెందిన కొండ సంజీవులు(42) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆగస్టు 30వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో చేపలు పట్టడానికి బోడగట్టు శివారులోని నాగారం చెరువు వద్దకు వెళ్లాడు. చెరువులో దిగిన సంజీవులుకు చేపల వల కాళ్లకు చుట్టుకోవడంతో నీట మునిగి మృతిచెందాడు. సోమవారం చెరువులో మృతదేహం తేలి ఉండటం కొండరాజు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.